క్లుప్తంగా

ముగ్గురి బైండోవర్



ఏటూరునాగారం: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ముందస్తు చర్యల్లో ముగ్గురిని శుక్రవారం బైండోవర్ చేశారు. ఏటూరునాగారం సర్పంచ్ ఈసం రామ్మూర్తి, కాంగ్రెస్ నాయకుడు దేవేందర్, బీఆర్ఎస్ నాయకుడు మాదరి రామయ్యను మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ శ్రీనివాస్ ఎదుట స్థానిక ఎస్సై కృష్ణప్రసాద్ బైండోవర్ చేశారు.

బాధితులకు అండగా..



వాజేడు: దళిత బంధు బాధితులకు అండగా దళిత సంక్షేమ సంఘం ఉంటుందని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ముద్దా పిచ్చయ్య అన్నారు. మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలో దళిత బంధు బాధితురాలతో ఆయన మాట్లాడారు. చెరుకూరు గ్రామానికి చెందిన వేల్పుల ఉదయలక్ష్మికి దళిత బంధు ఇస్తామని చెప్పి కొందరూ రూ.2 లక్షలను తీసుకుని మోసం చేయడం దారుణమన్నారు. భద్రాచలం నియోజకవర్గంలో ఎక్కడా జరగని విధంగా దళితులను మోసం చేయడం జరిగిందని ఆరోపించారు.

దుప్పట్ల పంపిణీ



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామానికి చెందిన మేకల మహేష్, శనిగరం రంజిత్ చలికాలాన్ని దృష్టిలో ఉంచుకొని కొంత మంది వృద్ధులకు దుప్పట్లు శుక్రవారం పంపిణీ చేశారు. వారి వెంట మాచెర్ల మనోహర్, హైదర్, నగునూరి రాజు తదితరులు ఉన్నారు.

డయాలసిస్ సేవలు

మహదేవపూర్: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ సేవలు ప్రారంభమైనట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. డయాలసిస్ రోగులు డాక్టర్ల సూచనల మేరకు పేర్లను నమోదుచేసుకొని సేవలు వినియోగించుకోవాలని కోరారు.

బీఆర్ఎస్ పార్టీపై అక్కసు

ప్రచార వాల్‌పోస్టర్‌పై పేడ



ములుగు రూరల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో వివిధ పార్టీల నాయకులు ప్రచారంలో భాగంగా వాల్ పోస్టర్లను అంటించారు. అయితే పత్తిపల్లి గ్రామంలో అంటించిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బడే నాగజ్యోతి ప్రచార పోస్టర్‌పై గుర్తుతెలియని వ్యక్తులు పేడను పూయడం గమనార్హం. పోస్టర్‌లోని నేతల ఫొటోలపై పేడ పూయడంతో ఈ వార్త సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది.

పోడు పట్టాలిచ్చిన ఘనత కేసీఆర్‌దే..

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నాగజ్యోతి

మంగపేట: పోడు భూములకు పట్టాలిచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి అన్నారు. మండలంలోని చుంచుపల్లి, రామచంద్రునిపేట, తిమ్మాపురం, దోమెడా, కత్తిగూడెం, రాజుపేటతో పాటు 11 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ఆమె శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు బతకమ్మలతో హారతులు ఇచ్చి ఆహ్వానం పలికారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్, టీడీపీ, తదితర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లోకి చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ.. తన తండ్రి ఏజెన్సీ ప్రాంతంలోని అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధి చేసేందుకు మావోయిస్టు పార్టీలో చేరి ఉద్యమంలో భాగంగా పోడు భూములను సాగు చేసేందకు సహకరించాడని అన్నారు. ఆయా పోడు చేసుకున్న భూములకు ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టాలు ఇచ్చారని అన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా పోడు భూముల విషయం పట్టించుకోలేదని కేసీఆర్ మాత్రం సర్వే నిర్వహించి అర్హులైన వారందరికి పట్టాలు ఇచ్చారని తెలిపారు. అదే విధంగా గిరిజనేతరులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇచ్చేందకు కేసీఆర్ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ మాయ మాటలు నమ్మి ఓటు వృథా చేసుకోవద్దని ఒక్కసారి తనకు అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. ఆర్ఎంపీ వైద్యుల సంఘం నాయకులు ఆమెకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణరావు, మండల అధ్యక్షులుడు లక్ష్మీనారాయణ, రోడ్లు భవనాల శాఖ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్, జిల్లా సీనియర్ నాయకులు వచ్చవాయి శ్రీధర్ వర్మ, ఎఫ్ఎస్ సీఎస్ చైర్మన్ తోట రమేష్, రైతు బంధు సమితి జిల్లా సభ్యుడు, మండల ఇన్‌చార్జ్ తుమ్మల్లారెడ్డి, నాయకులు రవియాదవ్, ముకుందం, వైకుంతం, నాగరమేష్, సమ్మయ్య, రామ్మూర్తి, శంకర్‌తో పాటు తదితరులు ఉన్నారు.



బతకమ్మను ఎత్తుకొని ప్రచారం చేస్తున్న నాగజ్యోతి

అభివృద్ధిని చూసి స్వచ్ఛందంగా పార్టీలోకి..



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సతీష్ రెడ్డి

ములుగు: సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని చూసి పలు పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లోకి వస్తున్నారని రెడ్కో చైర్మన్ సతీష్ రెడ్డి అన్నారు. ములుగు మండలంలోని రామచంద్రపురం గ్రామానికి చెందిన పలువురు నాయకులు శుక్రవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సతీష్ రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతిని భారీ మెజారిటీతో గెలిపిస్తామని ప్రజలు స్వతహాగా ముందుకు వస్తున్నారని అన్నారు. పార్టీలో చేరిన వారిలో ఆయా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సాదం రవి, యూత్ ఉపాధ్యక్షుడు అశోక్, మాజీ వార్డు సభ్యుడు రమేష్, ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షుడు కోమల్ల వీరారెడ్డి, సీనియర్ నాయకులు గూగులోతు కరణ్ సింగ్, తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

ఏటూరునాగారం: కన్నాయిగూడెం మండలంలోని ముప్పనపల్లి సహాయ నిధి ద్వారా ఏటూరునాగారం మండలం చెల్పాకకు చెందిన నిరుపేద పడిదల చంద్రక్కకు రూ.10వేలు ఆర్థిక సాయం శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా సహాయ నిధి అధ్యక్షుడు అబ్బు సతీష్ మాట్లాడుతూ.. పేద మహిళా రోజువారి కూలీ చేసి జీవనం గడిపే ఆమెకు 6నెలలు నుంచి పక్షవాతం రావడంతో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో మెరుగైన వైద్యం కోసం తమ వంతు సాయంగా ఆర్థిక సాయం అందజేశామన్నారు. కార్యక్రమంలో సభ్యులు తిప్పనపల్లి విజయ్, కిరణ్, రాజు, రమేష్, ప్రవీణ్, లక్ష్మయ్య, నవీన్, ప్రశాంత్, సంతు, సందీప్, సతీష్, కర్నె వెంకటేష్, సత్యం, మురళి, మహేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న అమర్‌సింగ్

ములుగు రూరల్: తెలంగాణ రాష్ట్రం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని బీఆర్ఎస్ నాయకుడు భూక్య అమర్‌సింగ్ అన్నారు. శుక్రవారం కాశిందేవిపేటలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతిని భారీ మెజారిటీతో గెలిపించాలని అన్నారు. ఈ నెల 05న కాశిందేవిపేటలో బడే నాగజ్యోతి, మండల ఎన్నికల ఇన్‌చార్జ్ సతీష్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు స్వామిరావు, లియాఖత్ అలి, రాజహుస్సేన్, గుండాల భాస్కర్, అసీమ్ అక్రమ్, పురుషోత్తం, అంకూష్, రాములు, రంజిత్, సలేందర్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా విక్రయిస్తే చర్యలు

రేగొండ: గుడుంబా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నిజాంపల్లిలో గుడుంబా స్థావరాలపై సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వివరాలను వెల్లడించారు. మండలంలోని నిజాంపల్లిలో అంకం రమేష్ అనే వ్యక్తి గుడుంబాను తయారు చేస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించి 22 లీటర్ల గుడుంబాతో పాటు, 840 లీటర్ల బెల్లం పానకాన్ని గుర్తించినట్లు తెలిపారు. కాగా గుడుంబాను స్వాధీనం చేసుకుని, పానకాన్ని ధ్వంసం చేసి, రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిషేధిత మత్తు పదార్థమైన గుడుంబాను ఎవరైనా తయారు చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



భూపాలపల్లి రూరల్: ప్రచారం నిర్వహిస్తున్న వాసుదేవరెడ్డి, జ్యోతి

భూపాలపల్లి రూరల్: రాష్ట్రంలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని దివ్యాంగుల రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి అన్నారు. మండలంలోని అతడి స్వగ్రామం గొర్లవీడుతో పాటు వజినపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కార్యక్రమాలు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి గండ్ర వెంకటరమణారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కళ్లెపు శోభరఘుపతిరావు, ఎంపీపీ మండల లావణ్య సాగర్ రెడ్డి, సర్పంచ్‌లు తాటికంటి శంకర్, తాళ్లపల్లి స్వామి, గ్రామ శాఖ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

టేకుమట్ల: బీఆర్ఎస్ పార్టీకే ప్రజల మద్దతు ఉందని ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గర్మిళ్లపల్లిలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందించి మాట్లాడారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్‌తోనే సాధ్యమని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకు పోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దాసారపు శ్రీనివాస్, సర్పంచ్ నల్లబెల్లి రవీందర్, ఎంపీటీసీ ఏనుగు లచ్చిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ దొడ్డ కోటి, పంగిడిపల్లి ఎంపీటీసీ గందం సారయ్య, రామకిష్టాపూర్(వి) సర్పంచ్ అడగాని రామారావు, తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని లక్ష్మీపూర్‌తండాలో బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచారంలో జెడ్పీటీసీ గొర్రె సాగర్ హాజరై ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. నాయకులు రాములునాయక్, కపిల్, ప్రవీన్, వినయ్, ప్రదీప్, తరున్, తిరుపతి, తదితరులు ఉన్నారు.

బీసీ అభ్యర్థులకు మద్దతు



మాట్లాడుతున్న వాసు

మల్హర్: అసెంబ్లీ ఎన్నిల్లో పోటీ చేస్తున్న బీసీ అభ్యర్థులను గెలిపించాలని బహుజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసు కె యాదవ్ ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని కొయ్యూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వాసు మాట్లాడారు. మంథని నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీసీ అభ్యర్థి పుట్ట మధును భారీ మెజారిటీతో గెలిపించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఇన్‌చార్జ్ విజయగిరి సమ్మయ్య, అక్కినవేన సమ్మయ్య, కత్తరశాల, రవి, ప్రసాద్, అయ్యూబ్, శేఖర్, వినయ్ పాల్గొన్నారు.

నాయకుల ప్రచారం

మహాముత్తారం: ఎన్నికల ప్రచారంలో బాగంగా మహాముత్తారం మండలంలోని ములుగుపల్లి, దుంపిల్లపల్లే గ్రామంలో శుక్రవారం ఇంటింటా తిరుగుతూ బీఆర్ఎస్‌కు నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కారు గుర్తుకు ఓటు వేసి పుట్ట మధును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దూలం మల్లయ్య, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'



మాట్లాడుతున్న రవీందర్

ఎస్ఎస్‌తాడ్వాయి: హామీల అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలం అయిందని సీతక్క యువసేన జిల్లా అధ్యక్షుడు చర్పా రవీందర్, కాంగ్రెస్ కిసాన్ సెల్ డివిజన్ కార్యదర్శి పులి గోపాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఊరట్టంలో ఆయన మాట్లాడుతూ.. సమాజం మీద అవగాహన లేని నాయకుల మాటలను నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేసి గెలిపించాలన్నారు. ప్రజలు ఆలోచించి సీతక్కను మరోసారి భారీ మోజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చర్పా శంకరయ్య, యూత్ కాంగ్రెస్ నాయకుడు దబ్బాగట్ల శంకర్ పాల్గొన్నారు.

పేదలకు అండగా కమ్యూనిస్టు పార్టీ

- సీపీఐ (ఎంఎల్) ఎమ్మెల్యే అభ్యర్థి మల్లేష్



ఎన్నికల ప్రచారంలో సీపీఐ ఎంఎల్ నాయకులు

చిట్యాల: పేదలకు కమ్యూనిస్టు పార్టీ నిరంతరం అండగా ఉంటుందని సీపీఐ (ఎంఎల్) నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మారెపెల్లి మల్లేష్ అన్నారు. శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ ప్రచారం చేస్తూ రానున్న ఎన్నికల్లో సీపీఐ ఎంఎల్ పార్టీకే ఓటు వేయాలని కోరారు. అలాగే ఎన్నికల ప్రచార నిర్వహణ కోసం తోచినంత ఆర్థిక సాయం అందించాలని కోరాగా రూ.3వేల నగదు అందించారన్నారు. ప్రతీ ఎన్నికల్లో నాయకులు కోట్లాది రూపాయలను వెచ్చిస్తూ పదవులు సొంతం చేసుకుని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన దాఖలాలే లేవాని ఆరోపించారు. అధికార పార్టీ నాయకులకే సంక్షేమ పథకాలను కట్టబెట్టి అర్హులకు మొండి చేయి చూపించారన్నారు. కావున అలాంటి నాయకులకు ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకునూరి జగన్, అంబాల కుమార్, సంగి రాజు, లింగయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



పార్టీలో చేరిన సర్పంచ్‌తో సత్యనారాయణరావు

- కాంగ్రెస్ భూపాలపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు

టేకుమట్ల: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లిలో చేపట్టిన ప్రజా దీవెన యాత్ర శుక్రవారం 14వ రోజుకు మండలంలోని కుందనపల్లిలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో ప్రజలు తనకు అవకాశం కల్పించి ఆశీర్వదిస్తే నియోజకవర్గ పాలేరుగా పని చేసి, అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని అన్నారు. వర్షాలతో చలివాగు, మానేరు పరివాహక ప్రాంత ప్రజలు సర్వం కోల్పోయి నిరాశ్రయులైనా ప్రభుత్వం కనీసం పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ప్రజా దీవెన యాత్రలో గండ్ర సత్యనారాయణరావు ఆధ్వర్యంలో బండపల్లి సర్పంచ్ నామని రాజేందర్ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్, రాగిడి దేవేందర్‌రెడ్డి, కోమల, ఆరె అరుణ పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఎలాంటి గొడవలకు తావివ్వొద్దు



కాటారం: మాట్లాడుతున్న సీఐ రంజిత్‌రావు



మహాముత్తారం: మాట్లాడుతున్న ఎస్సై సుధాకర్

మహాముత్తారం: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి గొడవలకు తావివ్వొద్దని ఎస్సై సుధాకర్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని పోలంపల్లి గ్రామంలో 58 బీసీఆర్పీఎఫ్ కంపనీ ఆర్ఐ భాస్కరా బృందంతో కలిసి కమ్యూనిటీ కాంట్రాక్ట్ పోగ్రాం నిర్వహించారు. గ్రామంలోకి ఆజ్ఞాత వ్యక్తులు వస్తే వారికి సహకరించొద్దని సూచించారు. గ్రామంలో నివసిస్తున్న వారి వివరాలను అడిగి తెల్సుకున్నారు. యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

కాటారం: కాటారం మండలం దామెరకుంటలో శుక్రవారం రాత్రి సీఐ రంజిత్‌రావు ఆధ్వర్యంలో పోలీసుల్ కమ్యునిటీ ప్రొగ్రాం నిర్వహించారు. అక్రమంగా తయారు చేస్తున్న గుడుంబా కేంద్రాలపై దాడులు నిర్వహించి 900 లీటర్ల బెల్లం పానకం ద్వంసం చేసి 18 లీటర్ల గుడుంబాను స్వాధీనపర్చుకున్నారు. గ్రామంలో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 21 ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు కొనసాగడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు అభినవ్, ప్రసాద్, సురేశ్, సుధాకర్, సీఆర్పీఎఫ్, సివిల్ సిబ్బంది పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

మల్హర్: పోడు చేసుకుంటున్న వ్యవసాయ భూమికి మళ్లీ పట్టాలు ఇవ్వాలని నాయకపోడు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి రమేష్ ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని కొయ్యూరు సెంటర్‌లో నాయకపోడు సేవ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కొమరం భీమ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీలపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టాలన్నారు. పోడు భూములపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు తాజోద్దీన్, మండల కోప్షన్ సభ్యుడు అయ్యూబ్‌ఖాన్, భాస్కర్, నాగారాజు, లక్ష్మినారయణ, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

ఆదరించి గెలిపిస్తే అభివృద్ధి చేస్తా..

- బీజేపీ భూపాలపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కీర్తిరెడ్డి



భూపాలపల్లి రూరల్: మాట్లాడుతున్న కీర్తిరెడ్డి

భూపాలపల్లి రూరల్: మీ ఇంటి ఆడబిడ్డగా ఆదరించి గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె మొదటి నామినేషన్ వేసిన అనంతరం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం సంతోషంగా లేరని మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశలు, అంగన్‌వాడీలు, పంచాయతీ కార్యదర్శులు, సీఏలు ఉద్యోగ సంఘాలు అనేక వర్గాల వారు ధర్నాలు నిరసనలు తెలుపుతున్న పరిస్థితి నెలకొందని తెలిపారు. ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకతతో ఉన్నారన్నారు. రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు అని చెప్పుకునే కాళేశ్వరంలో భాగమైన మేడిగడ్డ ప్రాజెక్టు కుంగడం ముఖ్యమంత్రి అవినీతి బాగోతం బయటపడ్డదన్నారు. నియోజకవర్గంలో సింగరేణి కార్మికుల సొంతింటి కలను బీజేపీ అధికారంలోకి తీరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కన్నం యుగందర్, జిల్లా మాజీ అధ్యక్షుడు వెన్నంపల్లి పాపయ్య, రాష్ట్ర నాయకులు చదువు రామచంద్రారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జిల్లా నాయకులు ఎరుకల గణపతి, రేగొండ సర్పంచ్ ఏడునూతల నిశీధర్ రెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సత్యవతి, పట్టణ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, నాయకులు బట్టు రవి, దొంగల రాజేందర్, మోహన్‌రెడ్డి, విష్ణు, దేశెట్టి గోపాల్, గొర్రె శివకుమార్, మోర్తల రాజేందర్, బండారి రవీందర్ స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే ఉచిత విద్య, వైద్యం



రేగొండ: ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

రేగొండ: బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే ఉచిత వైద్యం, విద్య అందిస్తామని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెన్నంపల్లి పాపయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని రామన్నగూడెంతండాలో కీర్తిరెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించాలని మండల అధ్యక్షుడు దాసరి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీతో అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సర్వోత్తమ రెడ్డి, బుచ్చిరెడ్డి, రాజు, రాజేందర్ నాయక్, మోహన్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఖాదీ వస్త్ర మేళా ప్రారంభం

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో వావిలాల ఖాదీ గ్రామోద్యోగ ప్రతిష్టన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖాదీ వస్త్ర మేళాను శుక్రవారం ప్రారంభించారు. దీపావళి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన ఖాదీ వస్త మేళాను ఏఐటీయూసీ బ్రాంచీ కార్యదర్శి మోటపలుకుల రమేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ నెల 10 వరకు వస్త మేళా కొనసాగుతుందని, చేనేత ఖాదీ వస్త్రాలపై 30శాతం తగ్గింపు ధరతో అందరికీ అందుబాటులో ఉన్నాయని ఖాది మేనేజర్ బాబురావు తెలిపారు. సింగరేణి ఉద్యోగులకు 5 వాయిదాల రూపంలో వేతన రికవరీ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని సింగరేణి ప్రాంత ప్రజలు, కార్మికులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాతంగి రామచందర్ నూకల చంద్రమౌళి, విజేందర్, దోర్నాల తిరుపతి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.